క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



అల్లిపురం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ గురువారం విజయవాడ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగనన్న నూతన ఉత్సాహంతో కనిపించారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తిరిగి మంచిరోజులు వస్తాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న ఆధ్యాత్మిక ఆరోపణలు దురదృష్టకరమన్నారు. వైఎస్సార్‌సీపీ చేసిన మంచిని ప్రజలు మరిచిపోలేదన్నారు. జగనన్న అందించిన సంక్షేమం, మంచి పాలనపై ప్రజలు ఇప్పటికీ ఆయనపై ఆదరణ చూపిస్తున్నారన్నారు.

శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం



కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మహాశాంతి హోమం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

అల్లిపురం: బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం మహాశాంతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, పంచసూక్తహవనం, మహా శాంతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణం, ప్రసాదశాల, అన్నప్రసాదశాల, అమ్మవారి నివేదనశాలకు సంప్రోక్షణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

జాతీయ అర్బన్ కన్వెన్షన్‌లో పాల్గొన్న జియ్యాని



జాతీయ అర్బన్ కన్వెన్షన్-2024లో పాల్గొన్న జియ్యాని శ్రీధర్ తదితరులు

అల్లిపురం: దేశ రాజధాని ఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ అర్బన్ కన్వెన్షన్–2024లో విశాఖ మహా నగరపాలక సంస్థ తరపున డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ నగరాల్లో ప్రజల జీవన విధానం మెరుగుపడే దిశగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జార్కండ్, చత్తీస్‌ఘడ్, షిల్లాంగ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

డ్వామా పీడీ పూర్ణిమాదేవి బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

మహారాణిపేట: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.పూర్ణిమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పీడీగా ఉన్న ఈ.సందీప్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. విశాఖ డీఎల్‌డీవోగా పని చేస్తున్న పూర్ణిమాదేవిని డ్వామా పీడీగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాబోయ్ బస్టాప్



ద్వారకానగర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్ పక్క రోడ్డులో.. జీవీఎంసీ కార్యాలయానికి అభిముఖంగా ఉండే ఆర్టీసీ బస్టాప్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడి నుంచి మద్దిలపాలెం, వాల్తేరు, మధురవాడ, భీమిలి, సేవానగర్, తగరపువలస ప్రాంతాలకు పలు సర్వీసులు నడుస్తాయి. ఈ స్టాప్ నుండి విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు పలు ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ఇంత ముఖ్యమైన బస్టాప్ నిర్వహణ పట్ల ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఆర్టీసీ కంట్రోలర్ ఉన్నప్పటికీ, బస్ సర్వీసులను కంట్రోల్ చేయటంలేదని.. అలాగే టైమింగ్స్ చార్ట్ ఉన్నా కూడా దాని ప్రకారం బస్సులు నడవడం లేదని ఆరోపిస్తున్నారు.

- ఆర్టీసీ కాంప్లెక్స్ 222, 999 బస్ షెల్టర్ అంటేనే హడలిపోతున్న ప్రయాణికులు
- ఈ స్టాప్‌లో విద్యార్థులు ఎక్కువ.. బస్సులు తక్కువ
- పట్టించుకోని అధికారులు

సీతమ్మధార: నగరంలోని అతి పెద్ద బస్టాపుల్లో ఆర్టీసీ కాంప్లెక్స్ 222, 999 బస్‌షెల్టర్ ఒకటి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్షల రూపాయలతో ఆధునిక బస్ షెల్టర్ నిర్మించింది. ఈ స్టాప్ నుండి విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు పలు ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. వాల్తేరు డిపోకి చెందిన 900కే, 999, మద్దిలపాలెం డిపోకి చెందిన 222, 222ఆర్, మధురవాడ డిపోకి చెందిన 25జే తదితర సిటీ బస్సులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తాయి. ఇంకా మద్దిలపాలెం, వాల్తేరు డిపోకి వెళ్లే బస్సులు కూడా ఈ బస్టాప్ మీదుగానే వెళ్తుంటాయి. కాగా భీమిలి వెళ్లే 999, 900కే, సేవానగర్ వెళ్లే 25జే, తగరపువలస వెళ్లే 222 నంబర్ సిటీ బస్సుల కోసం నిత్యం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు వేచి ఉంటారు. ఇక్కడ పేరుకి ఆర్టీసీ కంట్రోలర్ ఉన్నా ఎప్పుడుంటారో, ఎప్పుడుండరో తెలియని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కంట్రోలర్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన టైమింగ్ బోర్డుకు.. బస్సులు వచ్చే సమయాలకు ఏమాత్రం పొంతన కుదరదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇక్కడికి సమీపంలో ఉన్న ప్రజా రవాణా సంస్థ కార్యాలయంలో డీపీటీవో, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ అధికారి ఉన్నా సరే ఏనాడూ ప్రయాణికులకు బస్ సర్వీసులు ఎలా అందుతున్నదీ పట్టించుకున్న పాపాన పోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బస్ కోసం నిరీక్షిస్తున్న విద్యార్థినులు

బస్సెక్కాలంటే హైరానా..

ఈ స్టాప్‌లో బస్ ఆగగానే పెద్ద సంఖ్యలో ఉన్న ప్రయాణికులతో పాటు విద్యార్థులు కూడా దూసుకొచ్చి బస్సెక్కేస్తారు. దీంతో ఈ స్టాప్‌లో బస్ ఎక్కాలన్నా.. దిగాలన్నా నరకప్రాయమని వృద్ధులు, వికలాంగులు వాపోతున్నారు. మరికొందరు విద్యార్థులు కిటికీల్లోంచి కాలేజీ బ్యాగులు కర్చీఫ్‌ల మాదిరిగా వేసి సీటు రిజర్వ్ చేసుకుంటారు. **ఇదిలా ఉంటే గతంలో దాదావు** రూ.20 **లక్షలతో ఆధునిక బస్ షెల్టర్ నిర్మించినా** సరే ఘనత వహించిన ఆర్టీసీ డ్రైవర్లు మాత్రం ఇక్కడ బస్సు ఆపనే ఆపరు. పాత బస్టాప్ దాటిన తర్వాతే బస్సులు ఆపడం వల్ల రెండు బస్ షెల్టర్ల వద్ద వేచి ఉండే ప్రయాణికులు పరుగులు పెడుతూ వెళ్లి మరీ బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.



బస్ ఎక్కే క్రమంలో తోపులాట

బస్సుల కొరత..

ఇక్కడ బస్సుల కొరత తీవ్రంగా ఉందని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఆర్టీసీ అధికారులు దఫదఫాలుగా బస్ సర్వీసులు తగ్గించడం వల్ల ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సు సర్వీసులు లేని పరిస్థితి నెలకొంది. ఇక ఉన్న బస్సులు కూడా వరుసగా రెండు లేదా మూడు ఒకేసారి వెళ్లిపోతుంటాయి. ముఖ్యంగా 222, 900కే బస్సులు ఈ రకంగా వరుసగా వెళ్లిపోవడం.. మళ్లీ అరగంట నుంచి 40 నిమిషాల వరకు బస్సులు లేకపోవడం జరుగుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. అలాగే భీమిలి వెళ్లే 999 బస్సు ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియదని అంటున్నారు. మద్దిలపాలెం, వాల్తేరు డిపో వెళ్లే బస్సులు బస్‌బేకి బదులుగా మెయిన్‌రోడ్డు మీదుగా వెళ్లిపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లేవారు ఇక్కడ అధిక సమయం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకుంటోంది. ఇప్పటికైనా ప్రజారవాణా సంస్థ అధికారులు స్పందించి ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా సర్వీసులు పెంచాలని, ఆధునిక బస్ షెల్టర్ వద్దే బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్ కోసం పరుగులు తీస్తున్న విద్యార్థినులు

స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

అల్లిపురం: విద్యార్థులు స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములు కావాలని విశాఖ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పిలుపునిచ్చారు. గురువారం కళాశాల సమావేశ మందిరంలో ఇగ్నో రీజినల్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో 'శానిటేషన్ అండ్ పర్సనల్ హైజీన్'అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆమె ప్రసంగించారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలన్నారు. కేజీహెచ్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఆచార్యులు సీహెచ్ శిరీష పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇగ్నో రీజినల్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణారావు, కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష, వెంకటరమణ, వెంకటపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ దృష్టికి వార్డు సమస్యలు



వార్డు సమస్యలు తెలియజేస్తున్న జానకిరామ్

అల్లిపురం: గురువారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్ వార్డు సమస్యలపై తన గళం వినిపించారు. నిరుపయోగంగా ఉన్న సులభ్ కాంప్లెక్స్ స్థానంలో కొత్తది నిర్మించాలని, వార్డులో యూజీడీ నీళ్లు మంచినీటి పైప్‌లైన్‌లో కలుస్తున్నందున తక్షణమే పైపులు మార్చాలని, ఫిష్‌మార్కెట్‌లో అనధికారికంగా ఆశీలు వసూలు చేస్తున్నారని వివరించారు. ఈ మేరకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ స్పందించారని చెన్నా జానకిరామ్ తెలిపారు.

ఎన్‌ఎల్‌ఎం బృందానికి సహకరించండి



పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లాకు విచ్చేసిన జాతీయ స్థాయి పర్యవేక్షణ (ఎన్ఎల్ఎం) బృందానికి సహకరించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్ఎల్ఎం బృందం సభ్యుల క్షేత్ర స్థాయి పర్యటనపై గురువారం గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, డ్వామా, ఎంపీడీవోలతో జేసీ సమీక్షించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీ స్థాయిలో అమలయ్యే కేంద్ర ప్రభుత్వ పథకాల తీరుపై బృందానికి వివరించాలని చెప్పారు. బృంద సభ్యులు అనిల్ నింభోర్కర్, అనిల్ గైక్వాడ్ రోజుకు రెండు పంచాయతీల్లో ఐదు రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారని తెలిపారు. ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.శోభారాణి, జెడ్పీ సీఈవో డి.సత్యనారాయణ, డీపీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ కె. శ్రీనివాసరావు, ఎల్డీఎం ఎం.శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీ బాగ్చీకి వేదపండితుల ఆశీర్వాదం



సీపీ బాగ్చీని ఆశీర్వదిస్తున్న వేద పండితులు

అగనంపూడి: పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకకు చెందిన ఉమామహేశ్వర స్వామి ఆలయ అర్చకులు ఆశీర్వదించి జ్ఞాపిక అందజేశారు. ఈ ఆలయ కమిటీలో ఒకరిద్దరు ఆలయ అర్చకులకు జీతాలు చెల్లించకుండా మానసికంగా వేధిస్తుండడంతో సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు సీపీ బాగ్చికి ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ బాధితులకు ఫోన్‌చేసి అధైర్యపడొద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తర్వాత దువ్వాడ సీఐ ద్వారా గ్రామస్తులతో చర్చించి సమస్యను పరిష్కరించారు. అర్చక కుటుంబానికి ఆలయం నుంచి రావల్సిన జీతం బకాయి ఇప్పించారు. దీనికి కృతజ్ఞతగా అర్చక కుటుంబీలు గురువారం సీపీ కార్యాలయంలో ఆయనను కలిసి జ్ఞాపిక అందించడంతో పాటు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు పల్లంరాజు శర్మ, నాగేంద్రశర్మ, ప్రజా సంఘాల నాయకుడు పట్టా రామ అప్పారావు, నిమ్మకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

- నీట మునిగిన పాతనగరం
- ఇళ్లలోకి చేరిన వర్షం నీరు
- బయటికి రాలేకపోయిన పాదచారులు, వాహన చోదకులు
- తక్షణ చర్యలు చేపట్టిన జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది



వన్ టౌన్ ప్రధాన రహదారిలో వర్షం నీటిలో సాగిపోతున్న వాహనాలు



చెరువులా మారిన వెలంపేట పోస్టాఫీసు రోడ్డు

జగదాంబ: వాయుగుండం ప్రభావంతో గురువారం కురిసిన భారీ వర్షానికి పాతనగరంలోని రహదారులన్నీ జలదిగ్బంధం అయ్యాయి. చినుకు పడితే చెరువులను తలపించే పాతనగరంలో ఉదయం నుంచి కురిసిన వర్షానికి ముడుకుల లోతు నీళ్లు నిలిచిపోయాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని విధంగా వన్‌టౌన్ ప్రధాన రహదారి, పూర్ణామార్కెట్, బౌడారా రోడ్డు, రామకృష్ణా జంక్షన్, 75 ఫీట్ రోడ్డు, జనతా బజార్ రోడ్డు, వెలంపేట, ఆర్ఆర్ఎం రోడ్డు, ప్రసాద్‌గార్డెన్స్, మున్సిపల్ స్టేడియం రోడ్డు, పోర్టు ప్రధాన గేటు నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు రహదారులన్నీ చెరువుల్లా మారిపోయాయి. ప్రసాద్ గార్డెన్స్‌లో ఇళ్లలోకి నీళ్లు వెళ్లిపోవడంతో స్థానికులు బయటికి రాలేని స్థితిలో ఉండిపోయారు. లోతట్టు ప్రాంతాలైన చిలకపేట, రామకృష్ణానగర్, ప్రసాద్‌గార్డెన్స్, వెలంపేట, లక్ష్మీనగర్ వంటి ప్రాంతాలు పూర్తిగా నీట మునిగి పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యూజీడీ మ్యాన్‌హోల్స్, కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి. దీంతో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహం జరగని చోట చెత్త, పూడిక తొలగించి నీరు ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. దాంతో కొద్ది సేపటికి రహదారులపై నీరు కాలువల ద్వారా కెనాల్ వైపు ప్రవహించింది. దీంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.



నీట మునిగిన రామకృష్ణా జంక్షన్

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ

కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో మోహన్ కుమార్

మహారాణిపేట : ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ సవ్యంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా గురువారం రెవెన్యూ, ఎన్నికల విభాగం అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ నెల 28వ తేదీలోగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, అనుబంధ పోలింగ్ కేంద్రాల స్థానంలో కొత్త వాటికి ప్రపోజల్స్ సిద్ధం చేసి నివేదించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలకు సంబంధించిన నివేదికలు ఈ నెల 28వ తేదీలోగా సమర్పించాలని నిర్దేశించారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితా రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్లు సీతారాంమూర్తి, అఖిల, లక్ష్మారెడ్డి, శేషశైలజ, తహసీల్దార్లు, ఎలక్షన్ డీటీలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం గురువారం సిరిపురంలో గల లోటస్ ఆస్పత్రి–1,2 యూనిట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిజిస్ట్రేషన్ ఉన్నదీ లేనిదీ తనిఖీ చేశారు. 5 శాతం ఉచిత స్కానింగ్ చేస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపే సైన్ బోర్డు ప్రదర్శించాలని సూచించారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, డాక్టర్ల అర్హత సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హెరిటేజ్ వాక్



హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న పర్యాటక శాఖ డైరెక్టర్లు, అధికారులు

అల్లిపురం : ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా జిల్లాలో చారిత్రక ప్రదేశాలు, కట్టడాల విశిష్టతను తెలిపే విధంగా హెరిటేజ్ వాక్ పేరుతో గురువారం చేపట్టిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. జిల్లా టూరిజం కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ టౌన్‌హాల్ వద్ద ప్రారంభమై.. పలు ప్రాంతాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా టూరిజం అధికారులు బ్యానర్లు ప్రదర్శించి.. చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యాన్ని గుర్తించి, గౌరవించాలని నినదించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస ఫణి, జిల్లా పర్యాటక అధికారి జ్ఞానవాణి, ఏపీటీడీసీ ఈఈ రమణ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

3 నుంచి నవరాత్రి మహోత్సవాలు

సీతమ్మధార : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీమహా గణపతి ప్రసన్న వేంకటేశ్వర, శ్రీఅయ్యప్ప, శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో అక్టోబర్ 3 నుంచి శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు, అర్చకులు రాజాస్వామి తెలిపారు. 3 నుంచి 12 వరకు రోజూ 6 గంటల నుంచి 'దుర్గా హోమం' అనంతరం అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. నవరాత్రులలో రోజూ మధ్యాహ్నం అన్నసంతర్పణ ఉంటుందన్నారు.

మద్దిపాలెం : శ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ మూడు నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు 104 ఏరియాలో 3 నుంచి 12 వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తామని, అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 9, 10, 11 తేదీల్లో మహిళలచే సామూహిక కుంకుమార్చన జరుగుతుందన్నారు.

హోంగార్డుకు చెక్కు అందజేత



జగన్నాథరావుకు చెక్కు అందజేస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: హోంగార్డు విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న పీల జగన్నాథరావు గత నెల 15వ తేదీన పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా గురువారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తన కార్యాలయంలో అతనికి హోంగార్డుల ఒకరోజు వేతనం రూ.6,94,380 అందజేశారు.

రేణుక యల్లమ్మ వారికి ఎమ్మెల్యే వంశీ పూజలు



ఎమ్మెల్యే వంశీకృష్ణను సత్కరిస్తున్న ఆలయ కార్యవర్గ సభ్యులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారిని గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, కార్యవర్గ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతి గురువారం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, విల్లూరి డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.